


అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 303 ఎడిటర్: కె.యువరాజ్ గురువారం 13-8-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





**-ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి వీలైనంత నీటిని ఎత్తిపోయాలి - ధాన్యం దిగుబడి ఎక్కువగా ఉండే 5 జిల్లాల్లో 'సైలో బ్యాగ్' నిర్మాణాలు.. సమీక్షల్లో సీఎం రేవంత్**

**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితోపాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకున్నా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుతోందని చెప్పారు. ఇన్నాళ్లూ ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని విపక్ష నేతలు ప్రచారం చేసుకున్నారని.. దీనిపై అసలు వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ బ్యారేజీల నుంచి ఎత్తిపోసిన నీళ్లెన్ని, కిందకు వదిలేసిన నీళ్లెన్ని, వాడుకున్న నీళ్లెన్ని అనే వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని చెప్పారు. బుధవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్చార్డీ)లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "2019 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో ఎక్కడ నీళ్లు కనిపించినా కాళేశ్వరం నీళ్లేనని ప్రచారం చేసుకున్నారు. 2019లో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపూర్తయింది. 2023 అక్టోబరులో మేడిగడ్డ కుంగింది, అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయట పడ్డాయి. 2019 నుంచి 2023 దాకా కాళేశ్వరం బ్యారేజీల నుంచి ఎన్ని నీళ్లను ఎత్తిపోశారు? మళ్లీ కిందికి వదిలేసిన నీళ్లెన్ని ఎన్ని టీఎంసీలను వినియోగించారు? ఎత్తిన నీటి కోసం ఎంత విద్యుత్ ఖర్చయిందనే సమగ్రమైన లెక్కలు

4లో




**- నేటి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డుపై రయ్.. రయ్ - రెండు స్టీల్ బ్రిడ్జీలు సహా సవాళ్లను ఎదుర్కొని పూర్తయిన నిర్మాణం - నేడు సీఎం చేతుల మీదుగా ప్రారంభం**

**గుంటూరు, ఆగస్టు 12 (వన్‌నేషన్):** రాజధాని అమరావతికి ఎట్టకేలకు రాచబాట సిద్ధమైంది! అమరావతి నిర్మాణాల్లో అతి కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. గురువారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా ప్రారంభిస్తారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ప్రయాణించి రాయపూడి చేరుకుని అక్కడ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ తాళాలను సీఎం అందుకుంటారు. ఆ భవనాలను జీఏడీ పరం చేస్తారు. అలాగే రెండు స్టీల్ బ్రిడ్జిలనూ ప్రారంభిస్తారు. ఇలా.. ఒకే రోజు మూడు కీలక ఘట్టాలు ఆవిష్కృతం అవుతుండటం, ప్రభుత్వ భవనాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తుండటంతో రాజధాని గ్రామాల్లో సందడి నెలకొంది. సీడ్ యాక్సెస్ రోడ్డు అనుసంధానంలో భాగంగా నిర్మించిన రెండు స్టీల్ బ్రిడ్జిలు, సెకండ్ ఫేజ్ సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభోత్సవ ఏర్పాట్లను బుధవారం మంత్రి నారాయణ పరిశీలించారు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హామ్ కెనాల్ మీద ఒక స్టీల్ బ్రిడ్జి, 280 మీటర్ల పొడవుతో కొండవీటి వాగు, గుంటూరు చానల్‌పై మరో స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. ఉండవల్లి నుంచి నేరుగా అమరావతికి కనెక్టివిటీ రావడంతో మంగళగిరి, విజయవాడ ప్రజలు నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ప్రయాణించవచ్చని నారాయణ తెలిపారు. అమరావతికి స్వాగతం పలుకుతూ, స్టీల్ బ్రిడ్జి వద్ద ఏ...ఆకారంలో పైలాన్ ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచాలి

**విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం- క్షేత్రస్థాయి పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలి -- అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**



**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని మరింత పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీమతి డాక్టర్ కిరణ్మయి విద్యాశాఖ అధికా రులను ఆదేశించారు. బుధవారం జిల్లా IDOC భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, స్టేట్ టాస్ డైరెక్టర్ శ్రీ లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు వివిధ విద్యా అంశాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు (MEO\T), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRP\T, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యాశాఖ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదల, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి మండలంలోని పరిస్థితులను సంబంధిత వీజూలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతా యుతమైన పౌరసత్వ భావనను పెంపొం దించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ వెంకటేశ్వర్లు సమావేశంలో సమీక్షించిన అంశాలు, శాఖాపరంగా



చేపడుతున్న కార్యక్రమాలు, మండలాల వారీగా విద్యా పరిస్థితులను వివరించారు. అనంతరం అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, CRPలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, అన్ని మండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, జ౯ాలు తదితరులు పాల్గొన్నారు

# రూ.323 కోట్లతో ఉప్పాడ తీరానికి రక్షణ గోడ

**- ఐఐటీ- మద్రాస్‌తో ఏపీఎస్‌డీఎంఏ ఒప్పందం - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో ఎంవోయూ**



**అమరావతి, ఆగస్టు 12 (వన్‌నేషన్):** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంతంలో రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ఐఐటీ- మద్రాస్‌తో ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) మధ్య ఒప్పందం చేసుకుంది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీరప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ-మద్రాస్‌కు అప్పగిస్తూ బుధవారం మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. కేంద్ర విపత్తు నిర్వహణ నిధి ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. గోడ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు ఏపీ మారిటైం బోర్డు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఉంటుంది.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# ఘనంగా శ్రీ విశ్వకర్మ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

## ముఖ్య అతిథిగా తుంగతుర్తి రవి హాజరు







**మేడిపల్లి /ఆగస్టు 12/వన్ నేషన్ :** శ్రీ విశ్వకర్మ సంఘం మేడిపల్లి నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణం లో ఘనంగా జరిగింది. సంఘ అధ్యక్షులు కందోజు వెంక టాచారి, ప్రధాన కార్య దర్శి కూరెళ్ల లక్ష్మీనారాయ ణచారి సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగ తుర్తి రవిచారి ముఖ్య అతి థిగా విచ్చేశారు. ఈ కార్యక్ర మంలో నూతన కార్యవర్గం గా అధ్యక్షులుగా బెజ్జంకి శ్రీనివాసచారి, ప్రధాన కార్య దర్శిగా శ్రీరామోజు వేణుచా రి, కోశాధికారిగా మొలు పోజు రాజుచారితో పాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హాజరై మాట్లాడుతూ.. సమాజంలో విశ్వకర్మల సేవలు ఎంతో గొప్పవని, అందరూ ఐక్యత తో ఉంటూ సంఘ అభివృద్ధి కి పాటుపడాలని పిలుపు నిచ్చారు.గడిచిన 21 సంవ త్సరాలుగా ఎలాంటి విభేదా లు లేకుండా సంఘాన్ని ఏక తాటిపై నడిపిస్తూ,అభివృద్ధి కి అహర్నిశలు కృషి చేసిన మాజీ అధ్యక్షులు కందోజు వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి కూరెళ్ల లక్ష్మీనారాయణచారిల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నూతనంగా ఎన్నికైన కమి టీ కూడా అదే స్ఫూర్తితో సంఘాన్ని మరింత ముందు కు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం సర్వేశ్వర్‌చారి, జంగాచారి, రమేష్‌చారి, పబ్బోజు శ్రీనివాస్‌చారి, సోమాచారి, సుత్తోజు కుమారస్వామి, బాలాచారి, శంకరాచారి, రాములుచారి, బాలరాజు చారి, శ్రీనివాస చారి, రామాచారితో పాటు భారీ సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు చేయూత పింఛన్ దరఖాస్తు చేసుకోండి

## పాలకుర్తి శేషగిరి రావు



**మేడిపల్లి /ఆగష్టు 12/ వన్ నేషన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ పథకం కింద అర్హు లైన కొత్త లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని బిల్డర్ సెల్ కన్వీనర్ పాల కుర్తి శేషగిరిరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి గల అభ్యర్థు లు ఆగస్టు 31వ తేదీ లోపు చేయూత పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తు విధానం, అర్హత లు, అవసరమైన పత్రాలు మరియు ఇతర పూర్తి వివ రాల కోసం స్థానిక బోడుప్ప ల్ సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించా లని ఆయన సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖా స్తు చేసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని పాలకుర్తి శేషగిరిరావు మరో సారి ప్రజలకు పిలుపునిచ్చా రు. ప్రభుత్వ సంక్షేమ ఫలా లు అర్హులైన ప్రతి పేదవాడికి చేరాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, ఏ ఒక్క అర్హుడు కూడా ఈ అవకాశా న్ని కోల్పోకూడదని ఆయన ఆకాంక్షించారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు కొనసాగిద్దాం : ఎం.డి అన్వర్...




**బోడుప్పల్ /ఆగస్టు 12 / వన్ నేషన్ :** భారతదేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఏకైక జాతీయ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి అన్వర్ అన్నారు. బుధవారం నాడు ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాల యం వద్ద సంఘం 91వ ఆవిర్భావ దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి ఎం.డి అన్వర్ శ్వేత - అరుణ పతాకాన్ని ఎగురవేశారు.దఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకపూర్వమే దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగ రంలో భగత్ సింగ్, రాజ్‌గు రు, సుఖ్‌దేవ్, ఆజాద్‌లతో పాటు ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్ బాసు, ప్రేమ్ నారాయణ భార్గవ్ ల నాయకత్వాన 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (AISF) ఆవిర్భవించిందని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు కృష్ణ, అరవింద్, శ్రీకాంత్, సాయి చరణ్, వంశీ, సాయి, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరు టోర్నమెంట్‌లో పతకాల పంట పండించిన జివిఆర్ అకాడమీ...

## రికార్డు విజేతల కు అదన పు డీసీపీ బుర్హాన్ అలీ, ఏసీపీ రణవీర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు....



**హైదరాబాద్ / ఆగస్టు 12 /వన్ నేషన్ :** బెంగళూరు వేదికగా నిర్వహించిన కరాటే టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులను హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమానికి మల్కాజ్‌గిరి సిటీ పోలీస్ అదనపు డీసీపీ మహమ్మద్ బుర్హాన్ అలీ, చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ జి. రణవీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

బెంగళూరు కరాటే టోర్నమెంట్‌లో జివిఆర్ కరాటే అకాడమీకి చెందిన 24 మంది విద్యార్థులు పాల్గొని 38 ప్రథమ స్థానాలు, 10 ద్వితీయ స్థానాలు సాధించడం విశేషం. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించి, క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ మహమ్మద్ బుర్హాన్ అలీ మాట్లాడుతూ, క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఏసీపీ జి. రణవీర్ రెడ్డి మాట్లాడుతూ, జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు సాధించిన విజయాలు అభినందనీయమని అన్నారు. యువత క్రీడలు, విద్యపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా మద్యం ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వాటి వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు. కరాటే వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయాలతో ఆగిపోకుండా మరింత కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

ఈ వేడుకలో భాగంగా 'మిషన్-80' విజేత అయిన పోలీస్ కానిస్టేబుల్, జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థి వి.సుధాకర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన "మిషన్-80" వరల్డ్ రికార్డ్ అటెంప్ట్‌లో 80 షాబాద్ టైల్స్‌ను 9 విభిన్న కరాటే టెక్నిక్స్‌తో కేవలం 3 నిమిషాల 6 సెకన్లలో బ్రేక్ చేసి, నిర్ణయించిన 8 నిమిషాల సమయాన్ని అధిగమించిన సుధాకర్‌ను ముఖ్య అతిథులు అభినందించారు. సుధాకర్ సాధించిన ఈ విజయం కఠినమైన సాధన, శారీరక దృఢత్వం, పట్టుదల, ఏకాగ్రత, కరాటే నైపుణ్యాలకు నిదర్శనమని, యువతకు ఇటువంటి క్రీడాకారులు స్ఫూర్తిగా నిలుస్తారని అతిథులు తెలిపారు.

విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, కోచ్‌లు అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని జివిఆర్ కరాటే అకాడమీ నిర్వాహకులు తెలిపారు. కరాటే శిక్షణ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ధైర్యం, శారీరక దృఢత్వం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించడమే అకాడమీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ప్రోత్సహించిన మహమ్మద్ బుర్హాన్ అలీ, జి.రణవీర్ రెడ్డిలను అకాడమీ తరఫున ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, బ్లాక్ బెల్ట్‌లు, కోచ్‌లు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల హక్కుల కోసం టీఎంఎస్ఆర్‌యూ ఆధ్వర్యంలో మహా ధర్నా

**- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి: ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ - కొత్త కార్మిక చట్టాలతో హక్కులను హరించొద్దు: కె.బి. కదమ్ - డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు: టీఎంఎస్ఆర్‌యూ**



హైదరాబాద్, ఆగస్టు 12: మెడికల్ మరియు సేల్స్ ప్రమోషన్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన హక్కులు, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన "చలో హైదరాబాద్" మహా ధర్నా ఉత్సాహభరితంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పెద్ద సంఖ్యలో మెడికల్ రిప్రజెంటేటివ్లు, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ధర్నాలో పాల్గొని తమ హక్కుల కోసం నినదించారు.

ఈ మహా ధర్నాకు టీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షులు చీకోటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య రంగానికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్ల సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ పరిశ్రమ అభివృద్ధికి, వైద్య రంగానికి సేవలందిస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని కోరారు.

కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే సాధారణ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికే ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించే విధంగా చట్టాలు, నిబంధనలు ఉండాలని సూచించారు.

ఎఫ్ఎంఆర్ఏఐ సంయుక్త ప్రధాన కార్యదర్శి కె.బి. కదమ్ మాట్లాడుతూ, మెడికల్ రిప్రజెంటేటివ్లకు గతంలో చట్టబద్ధంగా లభించిన హక్కులు, రక్షణలు కొత్త కార్మిక చట్టాల కారణంగా దెబ్బతినకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కులను కాలరాసే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, కార్మికుల ప్రయోజనాలను పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందించడం సరికాదన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడుదాం

**-హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న వంపుగూడ బీజేపీ నాయకుడు నిశాంత్**



**కాప్రా, ఆగస్టు 12 (వన్ నేషన్) :** దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపు మేరకు కాప్రాలోని వంపు గూడలో ఘనంగా నిర్వహించారు.వంపుగూడకు చెందిన బీజేపీ నాయకుడు నిశాంత్ తన నివాసంతో పాటు స్థానిక కాలనీలోని పలు ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో వాతావరణాన్ని జాతీయ భావంతో నింపారు. చిన్నారుల చేతుల్లో త్రివర్ణ పతాకాలు రెపరెపలాడుతూ అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా నిశాంత్ మాట్లాడుతూ, "ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయడం ద్వారా మన దేశభక్తిని, జాతీయ గర్వాన్ని ప్రపంచానికి చాటుదాం. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, జాతీయ ఐక్యత, సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలి" అని అన్నారు.దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులను స్మరించుకుంటూ, రాబోయే తరాలకు దేశభక్తి విలువలను అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపును ప్రతి ఒక్కరూ స్వీకరించి ఈ జాతీయ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించారు

# ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026

**- సెలబ్రేటింగ్ ఎక్సలెన్స్ ఇన్ తెలంగాణ.**



**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** రౌండ్ టేబుల్ ఇండియా తెలంగాణలోని వివిధ రంగాలలో విశేషంగా రాణించిన అచీవర్స్ మరియు ఎమర్జింగ్ వ్యక్తులను సన్మానించేందుకు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ యొక్క 7వ ఎడిషన్ను గర్వంగా ప్రకటిస్తోంది. ఈ అవార్డులు మన సమాజ అభివృద్ధికి గణనీయంగా దోహదపడిన వ్యక్తులను మరియు సంస్థలను గౌరవిస్తుంది.

### 2026 అవార్డుల విభాగాలు:

ఈ సంవత్సరం, అవార్డులు 15 విభాగాలలో ఇవ్వబడతాయి: కళలు మరియు సంస్కృతి, ఎన్జీవో, స్టార్ ఉమన్, స్టార్ కిడ్, వినోదం, విద్య, స్టార్ట్-అప్, హెల్త్ కేర్, ఫుడ్ అండ్ బేవరేజెస్, రిటైల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇన్ఫ్లుయెన్సర్ , సస్టైనబిలిటీ ఎక్సెలెన్స్ , పరిపాలన సేవలు మరియు క్రీడలు. పైన పేర్కొన్న రంగాలలో విజయం పొంది మరియు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఒక అచీవర్ మరియు ఒక ఎమర్జింగ్ వ్యక్తిని సన్మానిస్తారు.

### నామినేషన్ మరియు ఓటింగ్ ప్రక్రియ:

గత ఎడిషన్ 2000 నామినేషన్లు మరియు 1,50,000 పబ్లిక్ ఓట్లతో విజయవంతమైన చరిత్రను సాధించిన తరువాత, ఈ సంవత్సరపు నామినేషన్లు కోసం 13 ఆగస్టు నుండి 27 ఆగస్టు 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 2026 జ్యూరీ: ఈ సంవత్సరం అవార్డుల ప్రదానం చెయ్యడం కోసం గౌరవనీయమైన జ్యూరీ సభ్యుల ప్యానెల్ను కలిగి ఉండడం మాకు గర్వకారణం: శ్రీమతి లక్ష్మీ నంబియార్, స్థాపకులు, సృష్టి ఆర్ట్ గ్యాలరీ. శ్రీ ముజ్తబా హసన్ అస్కరీ, వ్యవస్థాపకులు & మేనేజింగ్ ట్రస్టీ, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్: శ్రీ పి.రఘురామ్, స్థాపకులు, కిమ్స్-ఉషాలక్ష్మి హాస్పిటల్, శ్రీ రాజ్ కందుకూరి, జాతీయ అవార్డు గ్రహీత,సినీ నిర్మాత, దర్శకులు మరియు పంపిణీదారు. శ్రీ ఎం. వి. రమణ, ముఖ్య కార్యనిర్వహణా ధికారి, డా. రెడ్డీస్ ల్యాబ్స్. శ్రీ రమేష్ కాజ, కంట్రీ హెడ్- ఇండియా, ఎల్. పి. ఎల్. ఫైనాన్షియల్ హైదరాబాద్. శ్రీ సందీప్ సుల్తానియ, ఆర్థిక కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వం. శ్రీ షాహ్ అజీమ్ హమీద్, ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఫెయిర్మోంట్ బిల్డర్స్. శ్రీమతి శ్రీవిద్య రెడ్డి గుణంపల్లి, ఉపాధ్యక్షులు, జి. ఎన్. ఐ. టి. ఎస్. (GNITS) శ్రీ శ్రీనివాస రావు మహంకాళి, అడ్జంట్ ప్రొఫెసర్, ఎ. ఎస్. సి. ఐ. (ASCI) అడ్వైసర్: ఐ.ఐ.ఎల్.ఎం ఢిల్లీ, ఎస్ ఐ యు, తిరుపతి పొసీడెక్స్ టెక్నాలజీస్, హైదరాబాద్ అభైరో క్యాపిటల్ బోవర్ స్కూల్ ఆఫ్ ఎంట్రిప్రెన్యూర్షిప్.

మా స్పాన్సర్లు: మా ప్రధాన స్పాన్సర్లకు మనఃపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము- టైటిల్ స్పాన్సర్: ఫెయిర్మోంట్ బిల్డర్స్, పవర్డ్ - బై స్పాన్సర్: ఎస్ ఎ ఎస్ ఇన్ఫ్రా , కో - స్పాన్సర్లు : నీమన్స్, శ్రీ జగదాంబ పర్ల్స్, బిగ్ ఎఫ్ఎమ్, నోవొటెల్, మినార్ ఆటా.

నామినేషన్కు ఆహ్వానం: తెలంగాణ రాష్ట్ర నివాసులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు, పాల్గొనేవారు తమను తాము లేదా ఇతరులను www.prideoftelan-gana.com లేదా info@prideoftelangana.com కు ఇమెయిల్ ద్వారా తమ ఎంట్రీలను సమర్పించవచ్చు. ఈ వేదిక అర్హులైన వ్యక్తుల కఠిన పరిశ్రమ మరియు విజయాలను గుర్తించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్నిస్తుంది.

రౌండ్ టేబుల్ ఇండియా గురించిన పరిచయం:

1927లో ఇంగ్లాండ్లోని నార్విచ్లో స్థాపించబడిన రౌండ్ టేబుల్, 52 దేశాలలో 43,000 కంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక గ్లోబల్ ఫ్రెండ్షిప్ ఆర్గనైజేషన్గా వృద్ధి చెందింది. భారతదేశంలో, 1957 నుండి రౌండ్ టేబుల్ యాక్టివ్గా ఉంది, 320 కంటే ఎక్కువ టేబుల్స్ మరియు 4,600ం సభ్యులతో జీరో- ఓవర్హెడ్ పాలసీకి పేరుగాంచింది. సేకరించిన అన్ని నిధులు దాతృత్వ లక్ష్యాల కోసం, ప్రత్యేకించి వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలల నిర్మాణంపై వెచ్చించేలా RTI దృష్టి సారిస్తుంది.



హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్): గుర్రంగూడ లో తిరంగ్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు దేశభక్తిని చాటి చెప్పిన మహేశ్వరం కాంటెస్టెడ్ యం ఎల్ ఏ అందెల శ్రీరాములు గారు, బీజేపీ అధ్యక్షులు వీరకర్ణ రెడ్డి బీజేపీ మహిళా కార్యదర్శి మంజుల రాణి, మరియు యంపల్లి సంతోష రాణి, కార్పోరేటర్లు లక్ష్మారెడ్డి దడిగా శంకర్, మాజీ అధ్యక్షులు వెంకటరెడ్డి,

# హర్ ఘర్ తిరంగా' కార్యక్ర మాన్ని ప్రతి ఇంటా పండుగలా జరుపుకోవాలి: నరేష్ కుమార్ నర్సింగోజు




**మేడిపల్లి/ ఆగస్టు 12/వన్ నేషన్ :** భారత స్వాతంత్ర్య దినోత్స వ వేడుకలను పురస్కరిం చుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా - ఘర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మేడిపల్లిలోని ఉప్పల్ కోర్ట్ కాంప్లెక్స్ వద్ద ఘనంగా ర్యాలీ నిర్వహిం చారు. కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ నరేష్ కుమార్ నర్సింగోజు ఆధ్వర్యంలో జాతీయ న్యాయవాదు లందరూ కలిసి కోర్ట్ కాంప్లెక్స్ నుండి హనుమాన్ దేవాల యం వరకు తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ నర్సింగోజు మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడు, పౌరుడు ఆగస్టు 15వ తేదీ వరకు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయాలని పిలుపు నిచ్చారు. దేశభక్తిని చాటే ఈ మహత్తర వేడుకలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల సుధాకర్, శ్రీకాంతుడు, రవి గౌడ్, వంశీకృష్ణ, చంద్రశేఖర్, భారత్, నరేష్, జయ, సూర్యం, స్వప్న, మల్లికార్జు న్ తదితరులు పాల్గొన్నారు.

# జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమం



**కొత్తపేట; ఆగస్టు, 12 (వన్ నేషన్) :** జైశ్రీరామ్ సేవా సమితి అధ్యక్షులు ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని మోహన్ నగర్‌లో బుధవారం అమావాస్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని



వితరణ చేశారు.నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. జైశ్రీరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఠాగూర్ ఉపేందర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా మోహన్ నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అమావాస్య రోజున అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమని పెద్దలు చెప్పిన మాటలను ఆచరిస్తూ ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మందికి పైగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపారు.భవిష్యత్తులోనూ ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి సంగ్రామ్, వీరేష్, సురేందర్ ప్రసాద్, భాను ప్రకాష్, రవీందర్ సింగ్ ఠాగూర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# డా. పెరుక రాజుకు మరో అరుదైన గౌరవం



**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** ప్రముఖ కవి, రచయిత, సాహిత్య విమర్శకుడు, అనువాదకుడు, బహుభాషా కోవిదుడు, భారత సైన్యంలో జూనియర్ కమిషన్డ్ అధికారి డా. పెరుక రాజు గారికి మరో అరుదైన గౌరవం లభించింది. సాహిత్యం, అనువాదం, నైతిక విలువల పరిరక్షణ, మానవతా సేవా రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ నైతిక విలువల అకాడమీ ఇటీవల జీవితకాల సభ్యత్వాన్ని ప్రదానం చేసింది. అదేవిధంగా, సంగీతం మరియు కళల విశ్వవిద్యాలయం ఎశీబిఆర్ ఆధ్వర్యంలో నేడు ఫరీదాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాహిత్యం, అనువాద రంగాల్లో ఆయన చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ప్రముఖ పౌరులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఆంగ్ల సాహిత్యంలో స్నాతకోత్తర పట్టాతో పాటు పీహెచ్‌డీ, మూడు గౌరవ డాక్టరేట్‌లను పొందిన డా. పెరుక రాజు వివిధ భాషల్లో 15 గ్రంథాలను రచించారు. కవిత్వం, కథాసాహిత్యం, సాహిత్య విమర్శ, అనువాద రంగాల్లో ఆయన విశేష సేవలందిస్తున్నారు. దేశభక్తి, మానవీయ విలువలు, సామాజిక న్యాయం, జాతీయ సమైక్యత ఆయన రచనల్లో ప్రధానంగా ప్రతిధ్వనిస్తాయి. 'మై గిఫ్ట్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడిగా విద్య, సేవ, మానవతా కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవలందిస్తూ, "ప్రోత్సాహమే గొప్ప బహుమతి" అనే సందేశంతో ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సైనికుడిగా, సాహితీవేత్తగా, అనువాదకుడిగా, మానవతావాదిగా డా. పెరుక రాజు అందిస్తున్న బహుముఖ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# తెలంగాణ పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

## ఈబీసీడబ్ల్యూఏ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) ఉద్యోగాల నియామకాలకు వయోపరిమితిని పెంచాలని ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ ఉద్యోగాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న వయోపరిమితిని కానిస్టేబుల్ పోస్టులకు 36 సంవత్సరాలకు, ఎస్సై పోస్టులకు 39 సంవత్సరాలకు పెంచాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టులను సమగ్రంగా గుర్తించి, వాటిని భర్తీ చేసేందుకు నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. గతంలో ప్రభుత్వం జీవో నం.87 ద్వారా పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితిని పెంచినప్పటికీ, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు మరింత అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ పేర్కొంది. పలువురు అభ్యర్థులు వయోపరిమితి కారణంగా ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపింది. ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, పోలీస్ శాఖలో సిబ్బంది కొరత కూడా కొంతవరకు తీరుతుందని ఈబీసీడబ్ల్యూఏ పేర్కొంది. ఈ మేరకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేసింది.ద

# "పిల్లల ఉన్నతంగా అభివృద్ధి చెందాలి"



**నందవరం, ఆగస్టు 12 ఎం బాలకృష్ణ (వన్ నేషన్) :** పిల్లలు చదువులతో పాటు క్రీడల్లోనూ, భాషలోనూ, సామాజిక నైతిక, తదితర అభివృద్ధి పథంలో నడిపించడమే ఐసిడిఎస్ యొక్క ముఖ్య ధ్యేయమని నందవరం సిడిపిఓ సఫరున్నిస్సా బేగం మరియు నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణంరాజు గారు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన నందవరం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నీలమ్మ, డి ఆర్ పి లైన సురేష్, నాగరాజు టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి మండలంలోని అంగన్వాడీ టీచర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా హాజరైన నందవరం సిడిపిఓ సఫరున్నిస్సా బేగం మాట్లాడుతూ 0 నుండి 5 సంవత్సరాల లోపల పిల్లలందరికీ అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబుద్ధులు భవిష్యత్తు ఎదుగుదల ప్రాణాళికకు తొలిమెట్టు అన్నారు. అంగన్వాడీ కేంద్రాలే ప్రతి ఒక్కరికి భవిష్యత్తుకు పునాదులు అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో క్రమశిక్షణతో పాటు అక్షరాభ్యాసంతో పాటు, పిల్లల ఎదుగుదల సామాజిక ఎదుగుదల, అభివృద్ధిలో ఎదుగుదల, క్రీడల్లో ఎదుగుదల, వంటి మార్పులు చిన్న చిన్నగా మొదలై జ్ఞానం పెంపొందే విధంగా క్రీడలతో, విద్యాభ్యాసంతో ఎదుగుదలకు అంగన్వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు ట్రైనింగ్ నిర్వహించి, ఏ విధంగా పిల్లలను ఎదుగుదలకు కృషి చేయాలి, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి, అదేవిధంగా పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎందుకు తాగించాలి, దానితోపాటు చిన్నచిన్నగా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే యుక్తవయసు బాలికలు, లైంగిక వేధింపులను ఏ విధంగా ఎదుర్కొనాలి, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి, మహిళలు విద్యతోపాటు క్రీడల్లోనూ అన్ని రంగాల్లో రాణించే విధంగా అంగన్వాడీ కేంద్రం నుండి మొదటి దశతో ప్రారంభమై భవిష్యత్తు పునాది వరకు ఏకాగ్రతతో పట్టుదలతో సాధించి విజయం చేకూరాలని తదితర అంశాలపై టీచర్లతో నృత్యాల ద్వారా నాట్యం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దేశభక్తి జాతీయ ఐక్యత స్ఫూర్తిని చాటిచెప్పేందుకు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ



**హైదరాబాద్, ఆగస్టు 12 (వన్‌నేషన్):** దేశభక్తిని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నారు. బుధవారం చార్మినార్ వద్ద బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టీ.ఉమా మహేంద్ర ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్ర రావు మాట్లాడుతూ దేశభక్తి జాతీయ ఐక్యత స్ఫూర్తిని చాటిచెప్పేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో అందరూ పాల్గొనవచ్చునని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టీ.ఉమా మహేంద్ర, బీజేపీ నాయకులు శివయాదవ్, కే.సురేందర్, డాక్టర్ సురేఖ్, పాశం సురేందర్, పురం చందర్, రాకేష్ జైస్వాల్, మాజీ కార్పొరేటర్లు లాల్‌సింగ్, కునాల్ రావు, నితేష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ సభ ఏర్పాట్లపై అధికారులు, ముఖ్య నాయకులతో సమావేశమైన

# జగ్గారెడ్డి, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి



**సంగారెడ్డి, ఆగస్టు 12 (వన్ నేషన్):** 15న సంగారెడ్డి లో సిఎం రేవంత్ రెడ్డి సభ నేపథ్యం లో సంగారెడ్డి పట్టణం లోని ఐబీ గెస్ట్ హౌజ్ లో పోలీస్ అధికారులు, ముఖ్య నాయకులతో జగ్గారెడ్డి, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమావేశం అయ్యారు. సీఎం సభ కు జనసమీకరణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సీఎం ఐఐటీ లోని హెలిప్యాడ్ నుండి బయలుదేరి నేరుగా ఐబీ చౌరస్తా వద్దకు చేరుకుంటారని అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ ల విగ్రహాలను ఆవిష్కరిస్తారు అని తెలిపారు. అనంతరం సీఎం మాట్లాడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుండి వచ్చే లబ్ధిదారులు, కాంగ్రెసు నాయకులు కార్యకర్తల వాహనాల కోసం గంజి మైదాన్, మెడికల్ కాలేజీ లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే లు, మంత్రుల వాహనాల ను డీఈవో కార్యాలయం లో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఒక్క సంగారెడ్డి నియోజకవర్గం నుండి నలభై నుండి యాభై వేలమంది ని సభ కు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. అధికారులు ఇరవై వేల మంది లబ్ధిదారులను తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నారాయణ్ ఖేడ్ నుండి ఐదువేలు , ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి కలుపుకుని మొత్తం లక్షమందిని సభ కు తరలించేలా ప్లాన్ చేస్తున్నట్లు జగ్గారెడ్డి, సంజీవ రెడ్డిలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులురఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నీళ్లు గట్టిగా ఎత్తిపోయండి

(1వ పేజీ తరువాయి)

తీసి ప్రజల ముందుంచాలి" అని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన అధికారులు.. ఐదేళ్లలో 161.36 టీఎంసీలను ఎత్తిపోశారని, కానీ వరద రావడంతో ఎత్తిపోసిన నీటిలో 60 టీఎంసీలకుపైగా మళ్లీ నదిలోకే వదిలేశారని వివరించారు. అయితే ఈ వివరాలపై సమగ్రమైన లెక్కలు తీయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. మేడిగడ్డ నుంచి ఎత్తిపోయకుండా నీళ్లన్నీ వదిలేస్తున్నారని విపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని.. కాళేశ్వరం లేకుండానే ఎల్లంపల్లికి 43 టీఎంసీల వరద వచ్చిందని గుర్తుచేశారు. అందులో మిడ్‌మానేరుకు 17 టీఎంసీలను ఎత్తిపోశామని.. మరో 20 టీఎంసీలకుపైగా నదిలోకి వదిలేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. గోదావరి జలాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని చెప్పారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

# జెన్ జీ... యువశక్తి ఎనలేని శక్తి!

### - యువతే దేశ భవిష్యత్తు.. సృజనాత్మకతతో ప్రపంచానికి దిశానిర్దేశం

నేటి యువతే రేపటి భారతం. ఆలోచనలో వేగం.. ఆచరణలో చురుకుదనం.. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు.. సరికొత్త ఆవిష్కరణలపై ఆసక్తి.. ఇవన్నీ కలగలిసిన తరం జెన్ జీ. అపారమైన యువశక్తి భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం. ఈ శక్తిని సక్రమంగా వినియోగించుకోగలిగితే దేశాభివృద్ధి వేగం మరింత పెరగడం ఖాయం. భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో అగ్రస్థానంలో ఉంది. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్న యువత దేశ జనాభాలో సుమారు 27 శాతం. వీరి సంఖ్య 37.1 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. మరోవైపు 35 ఏళ్లలోపు వయసున్నవారు దేశ జనాభాలో దాదాపు 65-66 శాతం వరకు ఉన్నారు. అంటే భారత్ నేడు యువదేశం. దేశ సగటు వయసు కూడా కేవలం 28-29 ఏళ్ల మధ్యే ఉండటం విశేషం.

### యువతే అభివృద్ధికి చోదకశక్తి...

ఏ దేశానికైనా మానవ వనరులే అత్యంత విలువైన సంపద. ముఖ్యంగా విద్యావంతులైన యువత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తుంది. విజ్ఞానం, సాంకేతికత, పరిశోధన, పారిశ్రామిక రంగం, సేవలు, వ్యవసాయం.. ఇలా ప్రతి రంగంలోనూ యువత కీలక పాత్ర పోషించగలదు. విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడటమే కాకుండా.. ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. స్టార్టప్‌లు, నూతన ఆవిష్కరణలు, డిజిటల్ సేవలు, కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన వంటి ఆధునిక రంగాల్లో యువత ఇప్పటికే తమ ప్రతిభను చాటుతోంది.

### సంకల్పిస్తే సాధ్యం కానిది లేదు!

యువతలో ఉండే ఉత్సాహం, పట్టుదల, సాహసం, సృజనాత్మకతకు హద్దులు ఉండవు. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని కోసం నిరంతరం శ్రమిస్తే సాధించలేనిది ఏదీ లేదనే నమ్మకం యువతలో ఉండాలి. అవకాశాలు లేవని నిరాశ చెందడం కంటే.. అవకాశాలను సృష్టించుకోవడమే నేటి తరం లక్ష్యంగా పెట్టుకోవాలి. సమస్యలను చూసి వెనక్కి తగ్గకుండా.. వాటికి పరిష్కారాలు చూపించే తరం ఎదగాలి.

### బాధ్యతతో యువత ముందడుగు వేయాలి...

యువశక్తి కేవలం ఉత్సాహం, ఆవేశం మాత్రమే కాదు.. అది బాధ్యత కూడా. దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల బాధ్యత, పర్యావరణం పట్ల బాధ్యత, భవిష్యత్ తరాల పట్ల బాధ్యత యువత గుర్తించాలి. మాదకద్రవ్యాలు, హింస, తప్పుడు సమాచార ప్రచారం, సైబర్ మోసాలు, సమయాన్ని వృథా చేసే అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, సృజనాత్మకత వైపు అడుగులు వేయాలి. యువత ఆలోచన మారితే దేశ దిశ మారుతుంది. యువత అడుగు ముందుకు వేస్తే దేశం ముందుకు సాగుతుంది. యువత సంకల్పిస్తే అసాధ్యమనుకున్న లక్ష్యాలూ సుసాధ్యమే. జనాభా పరంగా భారత్‌కు లభించిన ఈ యువశక్తి.. అభివృద్ధి శక్తిగా మారిన రోజే భారతదేశం ప్రపంచ శక్తిగా మరింత బలంగా ఎదుగుతుంది. అందుకే.. "జెన్ జీ.. యువశక్తి ఎనలేని శక్తి.. ఇదే నేటి భారతానికి అసలైన బలం!"

-సయ్యదా ఆలియా ఇస్మత్
సీనియర్ పాత్రికేయురాలు
సెల్: 8639754985

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**